'సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు స్థలాలను గుర్తించాలి'

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 8 : సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో విజయలక్ష్మి, ఏడీ ల్యాండ్ సర్వేయర్ సుదర్శన్, గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

నార్నూర్, జనవరి 8: గ్రామీణ యువకులు క్రీడల్లో రాణించాలని బీఆర్ఎస్ నాయకుడు అడా రాజు, తుడుం దెబ్బ విద్యార్థి సంఘం మండల ప్రధాన కార్యదర్శి పెందోర్ సంతోష్ అన్నారు. గాదిగూడ మండలం పర్సవాడ(బీ)పంచాయతీ పరిధిలోని హిరాపూర్ గ్రామంలో శ్రీ గణేశ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు శంభు, హన్మంత్‌రావు, కుమ్ర సత్యపాల్ పటేల్, రాజు, మంగు, భీంరావు, కేశవ్‌రావు, యూత్ సభ్యులు, క్రీడాకారులున్నారు.

కొత్త విధానంతో రైతులకు అన్యాయం

ఎదులాపురం, జనవరి 8: పత్తి కొనుగోళ్లలో ఇది వరకు కొనసాగుతున్న విధానాన్ని తొలగించి కొత్తగా ధరలోటు చెల్లింపు పథకాన్ని అమలు చేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తుందని ఏఐకేఎఫ్ జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్రావు అన్నారు. బుధవారం సంఘం ప్రతినిధుల బృందం మార్కెట్ యార్డును సందర్శించి వివరాలు తెలుసుకుంది. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, పీడీపీవీకి నీతి అయోగ్ ఆదిలాబాద్ మార్కెట్‌ను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందని, ఈ విధానంలో ప్రైవేట్ వ్యాపారుల తప్ప రైతులకు ఎలాంటి న్యాయం జరగదన్నారు. ఈ విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. సీసీఐ కొనుగోళ్ల కారణంగానే ప్రైవేట్ దోపిడీ నియంత్రణలో ఉందన్నారు. ధరలోటు చెల్లింపు పథకం అమలుతో సీపీఐ, ప్రైవేటు వ్యాపారులు కుమ్మక్కై అవినీతికి పాల్పడే అవకాశాలు పెరుగుతాయని, ఇటు రైతులకు, అటు ప్రభుత్వ ఖాజానాను దుర్వినియోగంచేసే ప్రమాదముందన్నారు.

విద్యుత్ స్తంభం పైనుంచి పడి కార్మికుడి మృతి

ఎదులాపురం, జనవరి 8 : విద్యుత్ స్తంభం పైనుంచి పడి కార్మికుడు మృతి చెందాడని వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. సీతాగొందికు చెందిన పెందుర్ అరుణ్ (31) విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే మంగళవారం ద్వారక నగర్ మొచ్చిగల్లిలో కాంట్రాక్టర్ సూచనలు మేరకు పెందుర్ అరుణ్ ఎల్‌సీ తీసుకున్న తర్వాత విద్యుత్ స్తంభం ఎక్కాడు. ఒక్కసారిగా సర్వీస్ ఇండక్షన్ కరెంట్ సప్లై కావడంతో విద్యుత్ స్తంభంపై ఉన్న అరుణ్ ఒక్కసారిగా కిందపడి పోయాడు. హుటాహుటిన అతనిని రిమ్స్ దవాఖానకు తరలించారు. చికిత్స నుంచి మెరుగైన వైద్య చికిత్సల కోసం హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. బుధవారం భార్య పెందుర్ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఏజీపీకి సన్మానం

పెంబి, జనవరి 8: ఖానాపూర్ జూ నియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నూతనంగా నియమితులైన అసిఫ్ ఆలీ పెంబి మండల న్యాయవాదులు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఇక్కడ సల్లా ప్రశాంత్ రెడ్డి, ఐదు వెంకటేశ్ తదితరులున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తలమడుగు, జనవరి 8 : రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం చెందారు. తలమడుగు మండలంలోని ఉండం-కోసాయి రైల్వేస్టేషన్ మధ్యలో బుధవారం రైలు ఢీకొన్న ప్రమాదంలో 30 ఏళ్లున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఆదిలాబాద్ రైల్వే ఇన్‌చార్జి భోజన్న తెలిపారు. మృతుడిపై బ్లూ కలర్ కోట్, తెలుపు రంగు గీతల షార్ట్, బూడిద రంగు ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించామన్నారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బోథ్, జనవరి 8 : నిర్మల్ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విశ్వం అబాకస్ అండ్ వేదిక్ మ్యాథ్స్ జోనల్ స్థాయి పోటీల్లో బోథ్‌లోని నాగభూషణం పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఐదో తరగతికి చెందిన నిమిష్ రెడ్డి, నాలుగో తరగతికి చెందిన అశ్విని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. వీరికి నిర్మల్ ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రతిభపై కరస్పాడెంట్ కిషోర్, ఉపాధ్యాయులు అభినందించారు.

మద్యం తాగి వాహనాలు నడపద్దు

జైనథ్, జనవరి 8 : మద్యం తాగి వాహనాలను నడపద్దని నేషనల్ హైవే పీఆర్‌వో కేసర్ సింగ్ అన్నారు. బుధవారం మండలంలోని మాండగడ గ్రామంలో 2025 జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా వివిధ వాహనదారులు, గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హైవే పీఆర్‌వో మాట్లాడుతూ, అతివేగంతో వాహనాలను నడపవద్దన్నారు. జీబ్రా క్రాసింగ్ గుర్తులను వాహనదారులు గుర్తుపెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన పౌష్టికాహారాన్ని పంపిణీ చేయాలి

నేరడిగొండ,జనవరి 8 : అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న నాణ్యమైన పౌష్టికాహారాన్ని పంపిణీ చేయాలని ఆర్డీవో వినోద్ కుమార్ సూచించారు. బుధవారం నేరడిగొండలోని అంగన్‌వాడీ 1,2,3 లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తున్న తీరుపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. చిన్నారులకు అందించే ఆహారంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఎలాంటి తేడా ఉన్న చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ నాగారావ్, సాయిరాం, సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు వైద్య పరీక్షలు

కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కడెం, జనవరి 8: మండలంలోని ధర్మాజిపేట గ్రామంలో బుధవారం సీఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ సూర్య ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భవన నిర్మాణ కార్మికుల ఇంటింటికీ వెళ్లి రక్త నమూనాలు సేకరించి వైద్య పరీక్షలు నిర్వహించారు. లేబర్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ ఉచిత శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది జ్యోతి, దేవిక, తదితరులున్నారు.

ఆశ కార్యకర్తలకు న్యాయం చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 8: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశ కార్యకర్తలకు న్యాయం చేయాలని ఆశ కార్యకర్తల యూనియన్ నాయకులు బుధవారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఫిబ్రవరిలో జరగబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఫిక్స్‌డ్ వేతనంగా రూ.18 వేలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు బీ సుజాత, ఉపాధ్యక్షురాలు చంద్రకళ, కోశాధికారి రామలక్ష్మి, స్రవంతి తదితరులున్నారు.

వృత్తి విద్యతోనే స్వయం ఉపాధి

ఖైంసా, జనవరి, 8: వృత్తి విద్యతోనే స్వయం ఉపాధి సాధ్యమవుతుందని నిర్మల్ జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరశురాం అన్నారు. బుధవారం పట్టణంలోని గురుకృపా ఒకేషనల్ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వృత్తి విద్యా కోర్సుల్లో చేరడం ద్వారా నైపుణ్యాలు పెంపొందించుకొని చిన్న వయస్సులోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతారన్నారు. ఇందులో గురుకృప కళాశాల డైరెక్టర్ డాక్టర్ ముష్కం రామకృష్ణ గౌడ్, కళాశాల ప్రిన్సిపల్ సాయినాథ్, అధ్యాపకులు నరేశ్ గౌడ్, హరిత, శ్రీదేవి, మనీష, తదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్లకు జరిమానా

తాంసి(భీంపూర్), జనవరి 8 : భీంపూర్ మండలంలోని తాంసి(కే) పెన్‌గంగా నుంచి అక్రమంగా ఇసుకను మహారాష్ట్రకు తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను ఈనెల 5న రాత్రి పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు మైనింగ్ శాఖాధికారులు బుధవారం భీంపూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న ట్రాక్టర్లు పరిశీలించారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5 వేల చొప్పున మొత్తంగా రూ.25 వేలు జరిమానా చెల్లింపు తర్వాత రిలీజ్ ఆర్డర్ ఇచ్చినట్లు ఎస్ఐ కలీం అహ్మద్ తెలిపారు.

పోలీసు సేవలను వినియోగించుకోవాలి

- ఎస్పీ జానకి షర్మిల

ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

ఖైంసా, జనవరి, 8: ప్రజలు నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. బుధవారం ఖైంసాలోని ఎస్పీ ట్రాన్సిట్ క్యాంపులో ఏర్పాటు చేసిన 'నిర్మల్ పోలీస్.. మీ పోలీస్' కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమస్యలపై చట్ట ప్రకారం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఫిర్యాదు దారుల నుంచి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్‌లకు ఫోన్‌చేసి సూచనలు చేసినట్లు ఆమె తెలిపారు. ప్రజా సమస్యలపై ప్రతి బుధవారం ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఇక్కడ ఏఎస్పీ అవినాశ్ కుమార్, సీఐ గోపినాథ్, రూరల్ సీఐ నైలు, తదితరులున్నారు.

వ్యక్తిత్వ వికాసంపై పోస్టర్ల ఆవిష్కరణ

ఖైంసా, జనవరి, 8 : పట్టణంలోని ఆనందిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 20న గౌరీ శంకర్ గార్డెన్‌లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించే వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆనందిత ఫౌండేషన్ చైర్మన్ వాడేకర్ లక్ష్మణ్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లను బుధవారం ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ అవినాశ్ కుమార్, సీఐ గోపీనాథ్ ఆవిష్కరించారు.

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ

రమేశ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్, జనవరి 8 : మాకోడ గ్రామ బీఆర్ఎస్ కార్యకర్త భూమన్న అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనను మాజీ మంత్రి జోగు రామన్న పరామర్శించారు. అలాగే గూడ గ్రామానికి చెందిన చిన్న గంగన్న, అకోలి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పార్వతి కుటుంబాలను వారి గ్రామాలకు వెళ్లి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సర్సన్ లింగారెడ్డి, బద్ధం ఊశన్న, భోజన్న, కుంచెట్టి కేశవ్, పురుషోత్తం, వేణు మాధవ్, బట్టు సతీశ్, పురుషోత్తం యాదవ్ పాల్గొన్నారు.

ఎదులాపురం, జనవరి8: రోకండ్ల రమేశ్ మరణం పార్టీకి తీరని లోటని, పార్టీకి అతడు చేసిన కృషి ఎన్నడూ మరువలేనిదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రోకండ్ల రమేశ్ శ్రద్ధాంజలి కార్యక్రమాన్ని బుధవారం జీఎస్ ఎస్టేట్లో నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. రమేశ్ చిత్రపటం వద్ద పూలను సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్క కార్యకర్త ముందుకు పోవాలని మాజీ మంత్రి జోగు రామన్న సూచించారు. కార్యక్రమంలో ఇజ్జగిరి నారాయణ,యాసం నర్సిగ్ రావ్, నవతే శ్రీనివాస్, పండ్ల శ్రీనివాస్, ప్రభాకర్, బట్టు సతీశ్, ఉగ్గే విట్టల్ తదితరులున్నారు.

రమేశ్ కృషి మరువలేనిది

బోథ్, జనవరి 8 : మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆకుల రాజేందర్ మాతృమూర్తి ఇటీవల మృతి చెందారు. బుధవారం మాజీ మంత్రి జోగు రామన్న వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం ప్రకటించారు. ఆయన వెంట సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బీ శ్రీధర్ రెడ్డి, నాయకులు డాక్టర్ స్వామి, సదానందం, యానయ్య, రూప్‌చంద్, ఇఫ్తాకర్ ఉన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

నిర్మల్ అర్బన్, జనవరి 8 : నిర్మల్ పట్టణంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మీ వాడకు చెందిన సోమయ్య (35) బుధవారం బంగల్‌పేట్ కాలనీలోని ఓ మామిడి తోటలో స్థానికులకు ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారమివ్వగా అక్కడికి చేరుకున్న పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ ఘటనా స్థలిని డాగ్‌స్క్వాడ్‌తో పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. సమ్మయ్య స్నేహితులతో కలిసి దావత్ చేసుకునేందుకు మంగళవారం బయటకు వెళ్లాడు. అక్కడ రాము, మరో ఇద్దరు స్నేహితులతో గొడవ జరిగింది. సోమయ్య భార్య లక్ష్మికి ఫోన్‌చేసి రాము తనను బాగా తిట్టాడని ఇంటికి రానని చెప్పాడని మరుసటి రోజు బుధవారం ఉరేసుకుని కనిపించాడని పోలీసులకు వారిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతికింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

నిర్మల్ అర్బన్, జనవరి 8 : నిర్మల్ పట్టణంలోని సత్యసాయి ఒకేషనల్ కళాశాలలో బుధవారం హైదరాబాద్‌కు చెందిన హెచ్‌సీఎల్ టెక్నాలజీ ఆధ్వర్యంలో టెక్ బీ ప్రోగాంకు సంబంధించిన ఉద్యోగ మేళాను డీఐఈవో జాదవ్ పరశురాం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ మేళాలో 2023-24 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఎంపీసీ, ఎంఈసీ ఒకేషనల్ పూర్తి చేసుకున్న విద్యార్థులు జాబ్ మేళాకు హాజరయ్యారు. పలువురు నిరుద్యోగులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి ఏడాది శిక్షణతోపాటు ఉద్యోగ, ఉపాది ఉన్నత విద్యకు అవకాశం కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సురేశ్, డైరెక్టర్ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ శ్యాం తదితరులున్నారు.

ఉపాధి కూలీల పనిదినాలు పెంచాలి

పెంబి, జనవరి 8: జాతీయ ఉపాధి హామీ కూలీల పని దినాలు 200 రోజులకు పెంచి ఉపాధి కల్పించాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మంచికంటి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధి కూలీల వేతనం రూ.500 కు పెంచాలన్నారు. జాబ్‌కార్డులేని ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు అందజేయాలన్నారు. పని ప్రదేశంలో మెడికల్ క్యాంపు, తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శేషరావు, రాజన్న, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

శుక్రవారం విద్యుత్ పరిష్కార వేదిక

తానూర్, జనవరి 8 : బాసర సబ్ డివిజన్ పరిధిలోని బాసర, ముథోల్, తానూర్, లోకేశ్వరం మండాల విద్యుత్ వినియోదారుల పరిష్కార వేదికను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఏఈ ప్రదీప్ జాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రం తానూర్‌లోని సెక్షన్ ఆఫీసులో శుక్రవారం 10.30 నుంచి 1 గంట వరకు నిర్వహించే సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు తమ సమస్యల పరిష్కారానికి సకాలంలో హాజరు కావాలని సూచించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సారంగాపూర్, జనవరి 8 : మండలంలోని స్వర్ణ గ్రామానికి రాజుల సాయి (35) ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, రాజు భార్య కుటుంబ కలహాలతో నాలుగు సంవత్సరాల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి రాజు తల్లి భోజవ్వ వద్ద ఉంటున్నాడు. అయితే రాజు మద్యానికి బానిసై జీవితం మీద విరక్తితో మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో పురుగుల మందుతాగి ఇంటికి వచ్చాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం 108లో నిర్మల్ ప్రభుత్వ దవాఖాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

ఉపాధ్యాయులపై దాడి అమానుషం

తానూర్, జనవరి 8 : వెంగ్వాపేట్ జడ్పీ హైస్కూల్ గెజిటెడ్ హెచ్ఎం యు గజ్జారాంపై దాడి చేయడం అమానుషమని ఎస్టీయూ టీఎస్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు భూమన్న యాదవ్ అన్నారు. ఇలాంటి ఘటనలు విద్యావ్యవస్థకు అవమానకరంగా మారుతున్నాయన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ, ఇలాంటి వారిపై కఠిన చర్యలు ఉపక్రమించాలన్నారు. లేదంటే ముస్ముందు ఉపాధ్యాయులపై దాడులు జరిగే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సారంగాపూర్, జనవరి 8 : 2025-2026 విద్యాసంవత్సరానికి గాను ఆయా గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశం కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని జామ్ బాలికల గురుకులం ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు. ప్రవేశ పరీక్షకు రూ. 100 చెల్లించి ఫిబ్రవరి 1వ తేదిలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అలాగే 6,7,8,9 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో ఫిబ్రవరి 23న ఉదయం నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు దగ్గరలో ఉన్న గురుకులాలను సంప్రదించలన్నారు.

పురుగుల మందు తాగి ఒకరు

నర్సాపూర్ (జీ), జనవరి, 8 : పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నర్సాపూర్ (జీ) మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం అంజనీ తాండా గ్రామానికి చెందిన జాదవ్ శ్రీనివాస్ (44) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కడుపు నొప్పి భరించలేక ఆదివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు, గమనించిన కుటుంబీకులు నిర్మల్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ బుధవారం మృతి చెందాడు. కుమారుడు వినేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిరుపేదలకు అండగా కల్యాణలక్ష్మి

ముథోల్, జనవరి, 8: నిరుపేదలకు అండగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం నిలుస్తుందని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. బుధవారం ముథోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 37 షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు రూ.5 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మీ నర్సాగౌడ్, తహసీల్దార్ శ్రీకాంత్, మండలాధ్యక్షుడు పోతన్న, నాయకులున్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనకంటి సుభాష్

బొనకంటి సుభాష్

ఉట్నూర్ రూరల్/ఉట్నూర్, జనవరి 8: తెలంగాణ మెడికల్ హెల్త్ ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉట్నూర్‌కు చెందిన బొనకంటి సుభాష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన యూనియన్ సమావేశంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాంబాబు, అధ్యక్షుడు దుర్గం శ్రీనివాస్‌ను ఏకగ్రీకంగా ఎన్నుకున్నారు. ఈ పదవితో తనపై మరింత బాధ్యత పెరిగిందిని తనకిచ్చిన పదవికి న్యాయం చేస్తానని ఆయన పేర్కొన్నారు.

దేశీదారు నిందితులకు జరిమానా

మాట్లాడుతున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జుల్ఫీకర్ అహ్మద్

ఇచ్చోడ/గుడిహత్నూర్, జనవరి 8 : గుడిహత్నూర్ ముత్నూర్ గ్రామానికి చెందిన గులే శివాజీ గుడుంబా కేసులో పలుమార్లు పట్టుబడ్డాడు. తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినా మళ్లీ గుడుంబా అమ్ముతూ పట్టుబడ్డాడు. బైండోవర్ ఉల్లంగించినందుకు రూ.50 వేల జరిమానా విధించారు. బుధవారం ఇచ్చోడ ఎక్సైజ్ కార్యాలయంలో గులే శివాజీతో రూ.50 వేల చలానా కట్టించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జుల్ఫీకర్ అహ్మద్ తెలిపారు. అలాగే సొనాల గ్రామానికి చెందిన మట్టా చందర్‌సింగ్ దేశీదారు అమ్ముతూ పట్టుబడడంతో రూ.50 వేల జరిమానా కట్టించినట్లు తెలిపారు.

టీఎన్జీవో యూనియన్ సభ్యత్వ నమోదు

ఎదులాపురం, జనవరి 8 : ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తానని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు సంద అశోక్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని టీఎన్జీవో కార్యాలయంలో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వసతి గృహ సంక్షేమ అధికారులకు సభ్యత్వ రశీదులను అందజేశారు. ఇక్కడ టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ఏ నవీన్ కుమార్, వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం అధ్యక్షుడు నర్సింలు, కార్యదర్శి శ్రీనివాస్, ఓంప్రసాద్, సుజాత, రాధ, రవి, దత్తు, జయమ్మ, శివ, పర్వేజ్, చిన్నయ్య, సంధ్య పాల్గొన్నారు.

లంబాడి జేఏసీ మండలాధ్యక్షుడిగా రాథోడ్ సురేశ్

మండలాధ్యక్షుడికి నియామకపత్రాన్ని అందిస్తున్న లంబాడీ జేఏసీ నాయకులు

నార్నూర్, జనవరి 8: ఉట్నూర్ పట్టణంలో లంబాడి జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ రామారావు అధ్యక్షతన బుధవారం లంబాడి జేఏసీ నార్నూర్ మండలాధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు లంబాడి ఏజేసీ మండలాధ్యక్షుడు రాథోడ్ సురేశ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాథోడ్ శేషారావు, నేతావత్ రాందాస్ నాయక్ ఉన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఇంద్రవెల్లి, జనవరి 8: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ సునీల్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు గుట్కా, గంజాయి, సిగరెట్, మత్తు పానీయాలు వంటి వాటి దూరంగా ఉండాలన్నారు. చదువుకునే వయస్సులు చెడు అలవాట్లు చేసుకొని భవిష్యత్తు చెడిపోకుండా చూసుకోవాలని అన్నారు. శ్రద్ధతో చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చి ఉన్నత స్థానాలకు చేరాలని సూచించారు. అదేవిధంగా సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసుల నుంచి ఎలాంటి సహాయం కావాలన్నతమని సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే, ఎంపీ శంకుస్థాపన

ఎదులాపురం, జనవరి 8: ఆదిలాబాద్ పట్టణాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఎంపిక చేసుకొని అమృత్ పథకం కింద తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.340 కోట్లు ఇచ్చారని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. బుధవారం పట్టణంలోని టీచర్స్ కాలనీలో రూ.కోటీ 20 లక్షల టీఐఎఫ్డీసీ నిధులతో నిర్మించే సీసీరోడ్డు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అలాగే కాలనీలో రూ.కోటీ 60 లక్షల నిర్మించనున్న బీటీ రోడ్డు, సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎంపీ గొడాం నగేశ్, ఎమ్మెల్యే పాయల శంకర్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పవన్ నాయక్, జోగు రవి, కౌన్సిలర్ లక్ష్మణ్, నాయకులు , కాలనీ వాసులున్నారు.

నేరడిగొండ, జనవరి 8 : జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న సర్వీసు రోడ్లతో పాటు బైపాస్ రోడ